## • పత్తి సాగుకు విపత్తు



భూపాలపల్లి జిల్లాలో 95 వేల ఎకరాల్లో ఈ వానకాలం పత్తి పంట సాగవుతుందని అంచనా వేయ గా ఇప్పటివరకు రైతులు 30 వేల ఎకరాల్లో నాటి న విత్తనాలు ప్రస్తుతం మొలకెత్తాయి. అవి వర్షాలు లేక ఎండిపోయే పరిస్థితిలో ఉండగా రైతులు తోచిన విధంగా నీటిని అందిస్తూ కాపాడుకుంటున్నారు. కాటారం మండలం చింత కాని వద్ద పత్తి మొక్కలకు ట్రాక్టర్ డ్రిప్ ద్వారా రైతు లక్ష్మారెడ్డి ఇలా నీటిని పడుతున్నాడు. – జయశంకర్ భూపాలపల్లి, నమస్తే తెలంగాణ



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లిలో రోహిణి కార్తెలో పోసిన వరి నారు



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లిలో ఎక్స్‌కవేటర్‌తో బావిపూడిక తీయిస్తున్న రైతు చంద్రయ్య

## వ్యవసాయ బావుల్లో అడుగంటిన నీరు

వానకాలం ప్రవేశించి పక్షం రోజులు దాటినా ఆశించిన వానలు పడలేదు. వ్యవసాయ బావిలో జలాలు అడుగంటిపోవడంతో వేసిన నారుమళ్లను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే కోవలో పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామానికి చెందిన దీటి చంద్రయ్య గంటకు సుమారు రూ.4వేలు వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో తన వ్యవసాయ బావిలో పూడిక తీయిస్తున్నారు. ఈ సందర్భంగా సదరు రైతు మాట్లాడుతూ.. ఈ యేడు వానలపై ఆశలు వదులుకొని వరి సాగు కోసం బావిలో పూడిక తీయిస్తున్నట్టు చెప్పారు. గ్రామంలో తనతోపాటు చాలామంది రైతులు తనలాగే బావుల్లో పూడిక తీయిస్తున్నారని చంద్రయ్య తెలిపాడు. – ధర్మారం

# ట్రాన్స్‌ఫార్మర్ కాలి 15 రోజులు

- రిపేరింగ్ సెంటర్‌కు తరలించి వారం రోజులు
- దుక్కులు, నారు మళ్లు ఎండుతున్నా పట్టని అధికారులు
- ఆందోళనలో జనగామ జిల్లా దేవరుప్పుల రైతన్నలు

దేవరుప్పుల, జూన్ 22 : విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యాన్ని రైతులు విలువైన పంటలను కోల్పోతున్నారు. పదిహేను రోజులుగా కరెంట్ లేక దుక్కులు, నారు మళ్లు ఎండుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జనగామ జిల్లా దేవరుప్పులలో మండల కేంద్రంలోని గడ్డ చెలుకకు పోయే దారిలో ఎస్ఎస్–39 నంబర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి 15 రోజులవుతున్నది. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న 5 వ్యవసాయ మోటర్లు నడవకపోడంతో పోసిన నార్లు, దున్నిన దుక్కులు ఎండుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కరెంటోళ్లు పట్టించుకోకపోవడంతో 8 రోజుల క్రితమే తామే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను సింగరాజుపల్లి రిపేరింగ్ సెంటర్‌కు తరలించినట్టు తెలిపారు. పలుమార్లు కరెంటు అధికారులను సంప్రదించగా ఇదిగో వస్తది.. అదిగో వస్తది అంటూ ఒకటే సమాధానం చెప్పి పంపుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిన వెంటనే మరొకటి బిగించి, కరెంటు సరఫరా చేసే వారని, ఇప్పుడు ట్రాన్స్‌పార్మర్ కాలితే నరకం చూపిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరొకటి రావడానికి 15 రోజులకు పైగా సమయం పడుతున్నదని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బాధిత రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ సుధాకర్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తామని తెలిపారు.



జనగామ జిల్లా దేవరుప్పులలో కాలిన ట్రాన్స్‌ఫార్మర్ గద్దె

### నీళ్లు లేక తిప్పలైతాంది..



15 రోజులుగా కరెంట్ లేక నారుమడి ఎండింది. దున్నిన దుక్కి ఎండింది. నీరు లేక వానకాలం నాటు ఆలస్యమైతాంది. చాలాసార్లు కరెంటు ఆఫీసుకు పోయి ట్రాన్స్‌ఫార్మర్ విషయాన్ని అడిగితే రెండు రోజుల్లో వస్తుందని చెప్పి పంపిన్రు. శనివారం మళ్లీపోతే ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్ నంబర్ ఇచ్చిండ్రు. ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే ఇప్పట్ల రాదని చెబుతున్నరు. రెండునెలల కింద ఒకసారి కాలింది. వారం రోజులకు ఇచ్చిండ్రు. ఇప్పుడు మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ కాలి 15 రోజులైంది.

– సుంకరబోయిన యాదయ్య, రైతు

### పసులకు నీళ్లు బకిట్లళ్ల మోసుకొస్తున్నం..



వానకాలం నెత్తి మీదికి వచ్చింది. నార్లు పోసినం. నీళ్లు లేక నాట్లు లేటయితున్నయ్. రెండు ఆవులకు తాగడానికి నీళ్లు లేక దూరం నుంచి బకిట్లళ్ల తెచ్చి తాపుతున్నం. ట్రాన్స్‌ఫార్మర్ కోసం కరెంటు ఆఫీస్ సుట్టూ తిరిగితిరిగి యాష్టకొస్తున్నది. దబ్బున కొత్తది తెచ్చి బిగిస్తే దుక్కులు దున్నుకుంటం. ఎన్నడూ లేంది కరెంటోళ్లు ఇంత ఆలస్యం చేస్తుండ్రు.

– వల్లాల ఎల్లయ్య, రైతు



బర్రెల కళేబరాలతో విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదుట అందోళన చేస్తున్న రైతులు, గ్రామస్థులు

## కరెంట్ షాక్ తగిలి రెండు బర్రెల మృతి

- విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతోనేనని గ్రామస్థుల ఆగ్రహం
- సబ్ స్టేషన్ ఎదుట బర్రెల కళేబరాలతో రైతుల అందోళన

మల్లాపూర్, జూన్ 22: తొలగించిన కరెంటు తీగలు తగిలి విద్యుత్తుషాక్‌తో రెండు బర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన శనివారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో జరిగింది. ఈ ఘటనకు వి ద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని గ్రామస్థులు బర్రెల కళేబరాలతో సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులు, రైతులు, గ్రామస్థులు బర్రెల కళేబరాలను స్థానిక సబ్‌స్టేషన్‌కు తరలించి అందోళన చేపట్టారు. బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్సై కిరణ్‌కుమార్, ఏఈ, సిబ్బంది రైతులకు సర్దిచెప్పినా ఫలితం లేదు. చివరికి ఏఈ వినీత్‌రెడ్డి బాధితులకు నెల లోపు నష్ట పరిహారాన్ని అందజేస్తామని రాతపూర్వక హామీతో ఆందోళన విరమించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

- కరెంట్ తీగలు సరిచేస్తుండగా ప్రమాదం

నెల్లికుదురు, జూన్ 22: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో శనివారం చోటుచేసుకుంది. నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లికి చెందిన లింగాల వెంకన్న (56) తనకున్న ఆరు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. శనివారం మధ్యాహ్నం తన మూడో కుమారుడితో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. స్తంభం నుంచి మోటర్‌కు కరెంట్ సరఫరా చేసే తీగలను సరిచేస్తుండగా షాక్‌కు గురైన వెంకన్న.. అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్నకు భార్య, ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు.

## • బైక్ నాగలితో దున్నేద్దాం



మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కేంద్రంలో వెల్డింగ్ పనిచేసే గడీల నరేశ్, బైక్ మెకానిక్‌గా పనిచేసే అతడి సోదరుడు గడీల నాగరాజు కలిసి పాత ద్విచక్ర వాహనానికి పత్తి పంటలో కలుపు తీసే నాగలిని అమర్చారు. ద్విచక్రవాహనానికి సరిపోయేలా నాగలిని తయారు చేసి బిగించారు. ఇది గంటకు లీటరు పెట్రోలు ఖర్చుతో ఎకరంలో కలుపు తీస్తుందని, దీనిని రూ.8 వేల ఖర్చుతో తయారు చేశామని తెలిపారు. మండలంలోని ఊట్ల గ్రామానికి చెందిన లచ్చిరాంనాయక్ కోసం ఈ నాగలిని తయారు చేశారు. –గూడూరు

## వాణిజ్య



### మారుతి ఫ్రాంక్స్ వెలోసిటీ మాడల్

- ప్రారంభ ధర రూ.7.29 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 22: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ మరో మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఫ్రాంక్స్ వెలోసిటీ ఎడిషన్‌గా అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రత్యేక ఎడిషన్‌గా విడుదల చేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.7.29 లక్షలు. 1.0 లీటర్ టర్బో, 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో రూపొందించింది. 9 అంగుళాల టచ్‌స్క్రీన్ స్మార్ట్ ప్లే ప్రో+ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో కనెక్టివిటీ, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ చార్జింగ్ వంటి ఫీచర్స్ ఉన్నాయి.

### బయోకాన్ ఏపీ ప్లాంట్‌పై అభ్యంతరాలు

న్యూఢిల్లీ, జూన్ 22: ఆంధ్రప్రదేశ్‌లో బయోకాన్‌కు ఉన్న ప్లాంట్‌పై అమెరికా నియంత్రణ మండలి అభ్యంతరాలు వ్యక్తంచేసింది. ఏపీలోని విశాఖపట్నం వద్ద ఉన్న ఏపీఐ ప్లాంట్(సైట్ 5)ను ఇటీవల తనిఖీ చేసిన అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(యూఎస్ఎఫ్‌డీఏ) ఉన్నతాధికారులు ఈ యూనిట్‌పై నాలుగు అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఇందుకు సంబంధించి ఫామ్ 483(అబ్జర్వేషన్)కు జారీ చేసినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది.

### ఈవీలకు రెండు ప్రమాణాలు

న్యూఢిల్లీ, జూన్ 22: విద్యుత్‌తో నడిచే వాహనాల్లో భద్రత ప్రమాణాలు మెరుగుపరచడంతోపాటు నాణ్యమైన వాహనాలు అందించడానికి ది బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) సరికొత్తగా రెండు ప్రమాణాలను జారీ చేసింది. ఐఎస్ 18590:2024, ఐఎస్ 18606:2024తో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాల్లో భద్రత ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎల్, ఎం, ఎన్ విభాగాలను రూపొందించింది. డ్రైవర్లు, ప్రయాణికులకు భద్రత విషయంలో పెద్దపీట వేయడంలో భాగంగా ఈ నూతన మార్గదర్శకాలను రూపొందించింది.

# రైల్వే సేవలపై జీఎస్టీ ఎత్తివేత

- ప్లాట్‌ఫాం టికెట్లకు ట్యాక్స్ మినహాయింపు
- తొలి మూడేండ్ల బకాయిలపై వడ్డీ, జరిమానాలు రద్దు
- 53వ జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 22: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మండలి సమావేశం పన్ను చెల్లింపుదారులకు ఊరటనిచ్చింది. రైల్వే ప్లాట్‌ఫాం టికెట్లకు జీఎస్టీ మినహాయింపునిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నది. శనివారం ఇక్కడ జరిగిన 53వ జీఎస్టీ మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రైల్వే ప్లాట్‌ఫాం టికెట్లతో సామాన్యుడిపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు వీటిపై కౌన్సిల్ జీఎస్టీ మినహాయింపునిచ్చింది. ప్లాట్‌ఫాం టికెట్‌తోపాటు ఇతర సేవలు, విశ్రాంతి గదులు, వేచివుండే గదులు, క్లాక్‌రూం ఫెసిలిటీ, బ్యాటరీతో నడిచే కార్లపై జీఎస్టీ మినహాయింపునిచ్చినట్టు నిర్మలా సీతారామన్ చెప్పారు. పన్నులను హేతుబద్ధీకరించడంలో భాగంగా కౌన్సిల్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత తొలి మూడేండ్లలో జారీ అయిన డిమాండ్ నోటీసులపై జరిమానా, వడ్డీలను పూర్తిగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో జీఎస్టీ చెల్లింపుదారులకు భారీ ఊరట లభించినట్టైంది. అలాగే ఇన్‌పుట్ ట్యాక్స్ క్లెయింలో జీఎస్టీ నకిలీ ఇన్వాయిస్‌లకు చెక్ పెట్టే ఉద్దేశంలో భాగంగా దేశవ్యాప్తంగా జరిగే జీఎస్టీ రిజిస్ట్రేషన్లను ఆధార్‌తో అనుసంధానం చేయనున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఈ ప్రతిపాదనను ఇప్పటికే గుజరాత్, పుదుచ్చేరిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో వేగవంతంగా రిజిస్ట్రేషన్లు కావడంతోపాటు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌కు సంబంధించి మోసపూరిత ఇన్వాయిస్‌లకు చెక్‌పడే అవకాశాలున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను వచ్చే నెల ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్ తర్వాత మరోసారి జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కానున్నది. ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత జరిగిన తొలి జీఎస్టీ సమావేశం ఇదే.



న్యూఢిల్లీలో శనివారం జరిగిన 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

- 2017-18, 2018-19, 2019-20 (మార్చి 2025 నాటికి పూర్తిగాపన్ను చెల్లించిన సందర్భాల్లో మాత్రమే) సెక్షన్ 73 కింద జారీ చేయబడిన డిమాండ్ నోటీసులపై వడ్డీ, జరిమానాలకు మినహాయింపునిచ్చింది.
- లిటిగేషన్లను తగ్గించడానికి కౌన్సిల్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. అప్పిలేట్ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకోవడానికి పన్ను అధికారులకు ద్రవ్య పరిమితిని రూ.20 లక్షలుగా విధించింది. అలాగే హైకోర్టులో రూ.కోటి, సుప్రీం కోర్టులో రూ.2 కోట్లుగా నిర్దేశించింది.
- పన్ను డిమాండ్ నోటీసులకు సంబంధించి జరిమానాపై విధించిన వడ్డీని పూర్తిగా ఎత్తివేసింది.
- అన్ని రకాల పాల క్యాన్లు(స్టీల్, ఇనుము, అల్యుమినియం)పై 12 శాతం జీఎస్టీని విధించింది.
- విద్యా సంస్థల వెలుపల హాస్టల్‌లో ఉండే విద్యార్థులు లేదా ఇతరులు చెల్లింపులను రూ.20 వేల వరకు మినహాయింపునిచ్చింది. కనీసంగా 90 రోజులు ఉండేవారికి మాత్రమే ఈ మినహాయింపు.
- అట్టపెట్టలపై జీఎస్టీని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించింది. అలాగే అన్ని రకాల స్ప్రింక్లర్లు (ఫైర్ వాటర్ స్ప్రింక్లర్లు)పై 12 శాతం జీఎస్టీ
- సోలార్ కుక్కర్లపై 12 శాతం జీఎస్టీని విధించింది. సింగిల్ లేదా డ్యూయల్ ఎనర్జీ వాటికి ఈ పన్ను వర్తించనున్నది.
- 2017-18, 2018-19, 2019-20, 2020-21 ఆర్థికసంవత్సరాలకుగాను ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ జీఎస్టీఆర్-4 గడువును ఈ నెల 30 వరకు పెంచింది.
- ఈ-కామర్స్ సప్లయిర్లపై విధిస్తున్న టీసీఎస్‌ని ఒక్క శాతం నుంచి 0.5 శాతానికి తగ్గించింది.

### ఎరువులపై జీఎస్టీ మినహాయింపు లేదు..

ఎరువులపై జీఎస్టీ మినహాయింపుపై కౌన్సిల్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రైతులకు ప్రయోజనం కల్పించే ఉద్దేశంలో భాగంగా స్టాండింగ్ కమిటీ జీఎస్టీని ఎత్తివేయాలని, అలాగే ముడి సరుకులపై విధించే జీఎస్టీని తగ్గించాలని సూచించింది. ప్రస్తుతం ఎరువులపై 5 శాతం జీఎస్టీ వసూలు చేస్తుండగా, ముడిసరుకులైన సల్ఫ్యూరిక్ యాసిడ్, అమ్మోనియాపై 18 శాతం పన్ను విధిస్తున్నది.



## 'వడ్డీ ఆదాయంపై పన్ను వద్దు'

న్యూఢిల్లీ, జూన్ 22: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా.. వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపుంటే బాగుంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం డిపాజిట్లపై ఏటా పొందే వడ్డీ ఆదాయం రూ.40,000 దాటితే బ్యాంకులు ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్ (టీడీఎస్) కోతలకు దిగుతున్నాయి. సీనియర్ సిటిజన్లకు ఈ పరిమితి రూ.50,000గా ఉన్నది. ఇక సేవింగ్స్ అకౌంట్లలో వేసిన నగదు మొత్తాలపై వార్షిక వడ్డీ ఆదాయం రూ.10,000 మించితే పన్నులు వర్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పన్నులను ఎత్తివేస్తే బ్యాంకులకు ఉపయోగకరంగా ఉంటుందని దినేశ్ ఖారా అన్నారు. పెరిగే సేవింగ్స్‌ను దీర్ఘకాలిక మౌలిక ప్రాజెక్టులకు ఫండింగ్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను పూర్తిస్థాయి బడ్జెట్‌ను వచ్చే నెల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

### ఓలా స్కూటర్లపై 15 వేల రాయితీలు

బెంగళూరు, జూన్ 22: ప్రముఖ ఈవీ స్కూటర్ల సంస్థ ఓలా మరోసారి భారీగా డిస్కౌంట్ ప్రకటించింది. ఎస్1 స్కూటర్‌పై రూ.15 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఈ నెల 26 వరకు మాత్రమే ఈ ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయని, ఈ ఆఫర్ల కింద రూ.5 వేల వరకు క్యాష్‌బ్యాక్, మరో రూ.5 వేలు ఎక్స్ఛేంజ్ బోనస్(కేవలం క్రెడిట్ కార్డు ఈఎంఐలపై) కింద అందిస్తున్నట్లు తెలిపింది. అలాగే ఎస్1 ప్రో, ఎస్1 ఎయిర్‌పై రూ.2,999 విలువైన ఓలా కేర్+ సబ్‌స్క్రిప్షన్‌ను ఉచితంగా అందిస్తున్నది. దీంతో ఎస్1 ఎక్స్+ మాడల్ ధర రూ.89,999కి తగ్గనుండగా, ఎస్1 ప్రో ధర రూ.1,29,999కి, ఎస్1 ఎయిర్ ధర రూ.1,04,999కి తగ్గాయి.





# ఒకవైపు అమ్మకాలు..మరోవైపు లాభాలు



### పది రోజుల్లో 7 లక్షల కోట్లు పెరిగిన పీఎస్‌యూ సూచీలు

న్యూఢిల్లీ, జూన్ 22: ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్న కేంద్ర సర్కార్‌కు ఆయా సంస్థల షేర్లు రాకెట్ వేగంతో దూసుకుపోతుండటంతో మింగుడుపడటం లేదు. నరేంద్ర మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ సంస్థను వదలడం లేదు. ఏకంగా రికార్డు స్థాయి లాభాలను ఆర్జించిన సంస్థలను సైతం అమ్మకానికి పెట్టారు. ఎల్ఐసీతోపాటు ఏ సంస్థలో వాటాను బహిరంగ మార్కెట్లో అమ్మేశారు. మరోవైపు, ఈ సంస్థల షేర్లు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. నరేంద్ర మోదీ సర్కార్ మూడోసారి అధికారం చేపట్టిన నాటి నుంచి ఆయా సంస్థల షేర్లు భారీగా లాభపడ్డాయి. ముఖ్యంగా గత 10 రోజుల్లో పీఎస్‌యూల షేర్లు రూ.7 లక్షల కోట్ల మేర పెరగడం విశేషం. పీఎస్‌యూలను తెగనమ్మేస్తామని ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేసినప్పటికీ ఆయా షేర్లు మాత్రం మదుపరులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెడితే భవిష్యత్తులో అధిక రాబడి వచ్చే అవకాశం ఉంటుందన్న అంచనాతో దేశీయ, విదేశీ మదుపరులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని మార్కెట్ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వీటికితోడు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పీఎస్‌యూలు అంచనాలకుమించి రాణించడం కూడా మదుపరుల్లో ఉత్సాహన్ని నింపింది. ముఖ్యంగా దేశీయ బ్యాంకింగ్ దిగ్గజమైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రికార్డు స్థాయి లాభాలను ఆర్జించడంతోపాటు భారత్ పెట్రోలియం కార్పొరేషన్, కోల్ ఇండియాలు కూడా లాభాలు అత్యధికంగా నమోదయ్యాయి. ఆయా సంస్థల షేర్లు రాణించడంతో సంస్థల మార్కెట్ విలువ రెట్టింపుస్థాయిలో పెరిగింది. సంస్కరణలు కొనసాగుతుండటం, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా ఈ సూచీలు రాణిస్తున్నాయి. అలాగే అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు కూడా ఆశావాదంగా కదులుతుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అధికంగా నిధులు కుమ్మరించడం కూడా కలిసొస్తున్నది. కానీ, పలువురు మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం దూసుకుపోతున్న పీఎస్‌యూల స్టాక్‌లు ఎప్పుడైనా పేలే అవకాశాలున్నాయని అంటున్నారు. మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గదలకు లోనుకావచ్చని, అప్పుడూ ఆయా సూచీలు కుప్పకూలే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు.

### పదేండ్లలో 4 లక్షల కోట్లు

గడిచిన పదేండ్లలో ప్రభుత్వరంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా మోదీ సర్కార్ సేకరించింది అక్షరాల రూ.4.20 లక్షల కోట్లు. వీటిలో రూ.3.15 లక్షల కోట్లు మైనార్టీ వాటాను విక్రయించడంతో సమకూరగా, మరో రూ.69,412 కోట్లు మాత్రం పది ప్రభుత్వరంగ సంస్థల్లో వ్యూహాత్మక వాటాను విక్రయించడంతో లభించాయి. వీటిలో హెచ్‌పీసీఎల్, ఆర్ఈసీ, డీసీఐఎల్, హెచ్ఎస్‌సీసీ, ఎన్‌పీసీసీ, నెప్కో, టీహెచ్‌డీసీ, కామరాజర్ పోర్ట్, ఎయిర్ ఇండియా, ఎన్ఐఎన్ఎల్‌లు ఉన్నాయి.

### పది రోజుల్లో 24 వేల కోట్లు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వచ్చిన మొదట్లో వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులను తరలించుకుపోయిన ఎఫ్‌పీఐ.. స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకావడంతో మళ్లీ పెట్టుబడుల వైపు మళ్లారు. ఈ నెల 10 నుంచి ఇప్పటి వరకు జరిగిన పది ఈక్విటీ ట్రేడింగ్ సెషన్లలో ఎఫ్‌పీఐలు ఏకంగా రూ.23,786 కోట్ల నిధులు కుమ్మరించారు. ఎఫ్‌పీఐలు పెట్టుబడులు పెట్టడానికి ప్రధానంగా మూడు కారణాలని, స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకావడంతో సంస్కరణలు కొనసాగే అవకాశం ఉండటం, చైనా ఆర్థిక వ్యవస్థ పరుగు నెమ్మదించడం, ముఖ్యంగా గడిచిన నెలరోజుల్లోనే రాగి ధరలు 12 శాతం తగ్గడం కూడా ఇందుకు కారణమని మోజో పీఎంఎస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారి సునీల్ దమానియా తెలిపారు. అలాగే ఈక్విటీ మార్కెట్లో బ్లాక్ ఒప్పందాలు అధికంగా ఉండటం కూడా ఎఫ్‌పీఐల్లో జోష్ పెంచింది. జూన్ నెల వరకు ఎఫ్‌పీఐలు రూ.11,193 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.